

# వారధి

వారణాసి నాగలక్ష్మి

హిమాలయాల్లోని శివాలిక్ పర్వతశ్రేణుల మధ్యగా ప్రవహించి ప్రవహించి, ఋషీకేష్ అంతటా వీచే పిల్లతెమ్మెరల్ని తన నీటి ఆవిరితో చల్లగా మారుస్తూ, తళతళ మెరుస్తూ, గలగలలాడుతూ ముందుకి సాగిపోతోంది గంగమ్మ.

మే నెల కావడంతో సాయంత్రం అయిదు గంటలు దాటుతున్నా ఇంకా చల్లబడలేదు. రెండు తీరాల మీదా కనుచూపు పారినంత మేరా ఆలయాలూ, ఆశ్రమాలూ, ఇళ్లూ, బజార్లూ సంధ్యాసమయపు అరుణ కాంతుల్లో వింతగా మెరుస్తున్నాయి!

రాజేశ్వరి కొడుకు కుటుంబంతోపాటు మౌనంగా నడుస్తోంది. నదిలోని అలల్లాగే ఆమె మనసులోనూ ఆలోచనలు సుళ్లు తిరుగుతూ సాగిపోతున్నాయి. తను ఒంటరిదైపోయిందంటే ఇంకా నమ్మబుద్ధి కావడంలేదు. ప్రభాకరంతోటే తనదైన జీవితం అంతమైపోయింది.

అతను వెళ్లిపోయినా తన ప్రాణం ఇంకా ఉంది. ఆ పైవాడు తీసుకెళ్లేదాకా తను బతకాల్సిందే. ఒక్కర్తే బతకలేదు గనక కొడుకు కుటుంబంలోకి చొచ్చుకు వెళ్లి, అక్కడ తనకో స్థానాన్ని ఏర్పరచుకోవాలి. ఏడాది దాటిపోయినా అతని నిష్క్రమణం తాలూకు గాయం ఇంకా ఇంత పచ్చిగా ఉందేమిటి? లోపలికీ బయటికీ తిరిగే గాలి ఊపిరితిత్తుల్లో ఇంత కల్లోలం సృష్టిస్తోం దేమిటి?

తన పక్కనే నడుస్తూ ఎస్సెల్లార్ కెమెరాతో ఫోటోలు తీసుకుంటున్న మైథిలి తన కోడలు! విజయ్ పక్కనే నడుస్తూ గలగలా కబుర్లు చెపుతున్న పన్నెండేళ్ల సుమన్ లా ప్రకారం తన మనవడు.

వాళ్లు ఏడాదికోసారి వచ్చి తమతో వారమో, పది రోజులో ఉండి వెళ్లడానికీ, తనదైన ఇల్లు ఖాళీచేసి వాళ్ల జీవనస్రవంతిలో కలిసిపోయి జీవించడానికీ ఎంత తేడా. దీనికి తనెలా సర్దుకోగలదు?

తననిలా వదిలేసి వెళదామనుకున్న వ్యక్తి కనీసం తన జీవికకు అవసరమయిన చిన్నచిన్న పనులు కూడా నేర్పకుండానే హఠాత్తుగా మాయమయిపోయాడేమిటి?

"అమ్మా! మీరిక్కడే నిలబడండి. బోట్ టికెట్లు తీసుకొస్తా," ఆగి తల్లి భుజాన్ని సుతారంగా తట్టి వెళ్లాడు విజయ్.

"నాన్నా! నేనూ రావచ్చా?" అంటూ వెనకే వెళ్లాడు సుమన్. ఒక్కక్షణం ప్రభాకరం వెనక పరుగెత్తే చిన్నారి విజయ్ గుర్తొచ్చాడు రాజేశ్వరికి.

నిలుచున్నచోటు నుంచే మైథిలివైపు చూసింది. కెమెరా అడ్జెస్ట్ చేసుకుంటూ నదిలో కదులుతున్న పడవల ఫోటోలు తీసుకుంటోందామె.

ఆ ఫోటోలు దగ్గర పెట్టుకుని పెయింటింగ్స్ చేస్తుంది కదా! ఎంత ఆర్టిస్టయితే మాత్రం పవిత్రమైన గంగాహారతి కోసం వెళుతూ ఆ పాంటూ షర్టూ ఏమిటి? ఆ జుట్టేమిటి?

టికెట్లు తీసుకుని విజయ్ వచ్చాడు. ముందుకి నడిచి బోటు ఆగేచోటికి చేరారు. క్యూలో ముందున్న జనం ఎక్కేసరికి బోటు నిండింది. అయ్యో అనుకుంది రాజేశ్వరి. ఇంతలోనే అటునుంచి ఇంకో పడవ రావడం జనం బిలబిలా దిగిపోవడం జరిగాయి. ఖాళీపడవలోకి నలుగురూ ఎక్కారు.

"ఇక్కడ కూచుందాం," అంటూ తనకి నచ్చిన చోటికి పిలిచాడు సుమన్. వాడి కళ్లనిండా ఉత్సాహం. ఎదురుగా కనిపిస్తున్న రాంఝూలా వాడి దృష్టినాకర్షించింది.

"నాన్నా! దీనికి పిల్లర్లు లేవేమిటి? ఇంత పొడు గున్న వంతెన పిల్లర్లు లేకపోతే పడిపోదా?" అని అడిగాడు.

"పండూ! వచ్చే ముందు నీకేం చెప్పాను? ఇంట ర్నెట్లో మనం వెళ్లేచోటు గురించి అన్నీ చదవాలని చెప్పానా లేదా?" అన్నాడు విజయ్ నవ్వుతూ.

వాడు చిలిపిగా నవ్వాడు.

"చూశాను నాన్నా! అదీ... సస్పెన్షన్ బ్రిడ్జి. నదిలో పడవల ప్రయాణానికి అస్సలు అడ్డం లేకుండా మను షులు హాయిగా అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ వెళ్లడానికి పనికొచ్చే వంతెన ఇది! దానికి అటూ ఇటూ పెద్ద టవర్స్ వున్నాయి చూశారా? వాటినుంచి వేళ్లాడే సపోర్ట్ కేబుల్సూ, వాటికి ఎటాచ్ చేసిన చిన్న కేబుల్సూ వంతెన పడిపోకుండా ఆపుతాయి."

విజయ్ వాడి ఉంగరాల జుట్టు వేళ్లతో చెరు పుతూ, "దొంగా," అన్నాడు.

రాజేశ్వరి మైథిలివైపు చూసింది. కొడుకు వంక చూస్తున్న ఆమె కళ్లలో ఏదో మెరుపు. వెంటనే చూపు తిప్పుకుంది రాజేశ్వరి.

"మనం వెనక్కొచ్చేటపుడు రాం ఝూలా మీంచి వస్తాం కదా!" అడిగాడు మళ్లీ.

విజయ్ అవుననగానే పిడికిలి బిగించి, 'య్యెస్,' అంటూ ఓ ఎక్స్ప్రెషనిచ్చాడు.

చూస్తూండగానే బోటు నిండింది. ఎదురు బల్ల మీద కూర్చున్నవాడు కాస్తా లేచొచ్చి విజయ్కీ, రాజే శ్వరికీ మధ్య కూర్చుంటూ, "మామ్మా! రేపు మాతో రాఫ్టింగ్కి మీరూ రావాలి," అన్నాడు.

"లేదు నాన్నా! రేపు మీరు ముగ్గురూ వెళ్తారు. పొద్దున్నే నీలకంఠేశ్వరస్వామి దర్శనానికెళ్తాం కదా! తర్వాత నేను గెస్ట్హౌస్లో రెస్ట్ తీసుకుంటాను. మీరేమో రివర్ రాఫ్టింగ్కి వెళ్తారు. మీరు తిరిగొచ్చాక గంగా స్నానాని కెళ్తాం అందరం," అంది రాజేశ్వరి.

వాడు రాజేశ్వరి చేతిమీదికి వాలిపోతూ, "మామ్మా ప్లీజ్! మీరూ రావాలి మాతో," అన్నాడు.

రాజేశ్వరి వాడి మాటలకి అంత ప్రాధాన్యత ఇవ్వ కుండా బోటు బయటికి చూస్తూ ఉండిపోయింది. పడవ నిండా జనం ఉన్నా ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఎటు చూసినా సంధ్యాసుందరి వయ్యారాలు పోతూ ఉంది. ప్రతి దృశ్యం వైబ్రంట్గా, అందంగా, పవిత్రంగా కనిపిస్తోంది.

రాజేశ్వరి మనసంతా ఆవరించిన ఒంటరితనం వల్ల ఆ దృశ్యాల్లోని సౌందర్యంలో కూడా విషాద ఛాయలు అలుముకున్నట్లే తోచింది.

తనూ భర్తా ఒకరికొకరుగా జీవిస్తున్నపుడు ఏ సమస్యా తననంతగా బాధించలేదు. ఒక్కడే కొడుకు, వాడిని పెంచి పెద్దచేశారు. చదువూ సంధ్యా చెప్పిం చారు. తమకెంత నచ్చకపోయినా వాడిష్టపడ్డ పిల్లని చేసుకుందుకు ఒప్పుకున్నారు.

వాడి జీవితం వాడిది అనుకున్నారు. ఎక్కడో సముద్రాలకవతల వాడూ, వాడి కుటుంబం... ఆ అమ్మాయి వాడి భార్యగానే తనకి కనిపిస్తుంది. తన కోడలుగా ఎప్పుడూ అనిపించదు.

పొడుగాటి జడా, పచ్చగా మెరిసిపోయే శరీరం, కలువరేకుల్లాంటి కళ్లూ, సంప్రదాయ కుటుంబం నించి వచ్చిన నీలిమని కోడలుగా చేసుకోవాలని తనెంతో కోరుకుంది.

ఆరడుగుల పొడుగూ, కోటేరేసిన ముక్కూ, వెన్నెల్లా నవ్వే విజయ్బాబుకి తగినపిల్ల అసలు దొరుకు తుందా అనుకుంటుంటే నీలిమావాళ్లు పక్కింట్లోకి అద్దె కొచ్చారు.

తను కోరుకున్నవన్నీ ఆ పిల్లలో కనిపించాయి. ఏం లాభం? అప్పటికే వాడి మనసులో మైథిలి తిష్ట వేసుకుంది. ప్రభాకరం కూడా, 'వాడికి నచ్చిన పిల్లని చేసుకోనీ,' అని తనని ఒప్పించారు.

తాము ఒప్పుకోకపోయినా వాడు ఆ అమ్మాయినే చేసుకునేవాడేమో! ఒప్పుకుని మర్యాద నిలుపుకున్నారు తామిద్దరూ.

ఒక్కడే కొడుకైనా వాడి కుటుంబం దూరంగా ఉండడానికి తను అలవాటు పడిపోయింది. ప్రభాకరం తననెంతో ప్రేమగా చూసుకునేవారు. ఆ రోజుల్లో ఒకరు వెళ్లిపోయి రెండోవారు ఒంటరిగా మిగిలిపోతే ఏమవు తుందో అన్న ఆలోచనే తన మనసులోకి రాలేదు. ఎప్పటికీ తామిద్దరూ కలిసే వుంటారన్నట్టుగా జీవిం చింది.

పరాకుగా కూర్చున్న తల్లినీ, ఆవిడ మీదకు వాలిపోయి బతిమాలుతున్న సుమన్నీ చూస్తూ ఆలో చనలో పడ్డాడు విజయ్.

ముప్పై ఎనిమిదేళ్ల దాంపత్యజీవితం వాళ్లది. ప్రభాకరం ఉన్నన్నాళ్లూ రాజేశ్వరికి బయటి విషయాలేవీ తెలుసుకోవలసిన అవసరం రాలేదు. ఆయన ఇష్టా యిష్టాలూ అవసరాలూ గమనించుకుంటూ, ఆయన ఆజ్ఞలు పాటిస్తూ ఆవిడా, ఆవిడ సరదాలు కొద్దో గొప్పో

తీరుస్తూ, ఆవిడకవసరమయిన వాటన్నిటినీ ఏర్పాటు చేస్తూ ఆయనా జీవించారు.

తనకన్నా పదేళ్లు చిన్నదైన రాజేశ్వరిని చిన్నపిల్ల లాగా ట్రీట్ చేస్తూ, సంఘంలో ఆవిడ గౌరవానికి భంగం రాకుండా చూసుకునేవారు ప్రభాకరంగారు. ఒక ఆదివారం మధ్యాహ్నం భోజనాల వేళ తలనొప్పి ఎక్కువగా వుందనీ, అన్నం తినాలని లేదనీ ఆయన పడుకుంటే, ''మీకు ఆకలి వేస్తున్నా తెలీదు. కాస్త పెరుగన్నం తినండి... అదే తగ్గుతుంది,'' అని బలవంతాన తినిపించింది రాజేశ్వరి.

తిన్న కొద్దిసేపటికే వాంతి చేసుకుని మొదలు నరికిన చెట్టులా పడిపోయాడు ప్రభాకరం. మాసివ్ హార్ట్ ఎటాక్ అన్నారు. కొడుకు కుటుంబంతో కబుర్ల కాలక్షేపం కోసం సంపాదించిన కంప్యూటర్ పరిజ్ఞానం అన్ని రకాల సైట్స్‌లోనూ గుండెపోటుల గురించి చదివి భర్తని చేజేతులా తనే చంపుకుందని నమ్మేందుకు పనికొచ్చింది. అప్పటినుంచీ రాజేశ్వరిలో చాలా మార్పొచ్చింది.

తిండిపై ఆసక్తిపోయింది. కొద్ది నెలల్లోనే బరువు సగానికి తగ్గిపోయింది. ఎవరితోనూ మాట్లాడకుండా నిస్సత్తువగా రోజు గడిపేస్తూ దగ్గరివాళ్లెవరయినా వచ్చి పలకరిస్తే భర్తని తన మూర్ఖత్వం వల్ల ఎలా చంపుకుందో వివరిస్తూ, అతను వెళ్లిపోయాక తను బతకడంలో అర్థంలేదన్నట్లు మాట్లాడుతూ అదో ధోరణిలో పడిపోయింది.

అప్పటివరకూ తనకి మార్గదర్శకుడుగా ప్రభాకరం ఉండడంతో రాజేశ్వరి ఎప్పుడూ భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించలేదు. వంటకి ఆధరువులూ, రాబోయే పండక్కి కొనవలసిన బట్టలూ, సరుకులూ, దగ్గర్లో వున్న శుభకార్యాలకి చెయ్యాల్సిన ప్రయాణాలూ, ఇవ్వాల్సిన బహుమతులూ...

ఇవే ఆవిడ భవిష్యత్తు గురించిన ఆలోచనలూ, ప్రణాళికలూ, భర్త చుట్టూ అల్లుకున్న జీవితం తప్ప ఆవిడకే సొంతమైన జీవితం ఏమీలేదు.

హఠాత్తుగా ఆయన నిష్క్రమించేసరికి పిడుగుపాటుకి చెట్టు మాయమైతే దానినల్లుకున్న తీగలా కుప్పకూలిపోయిందావిడ.

ఈ విషయం అర్థంకాగానే విజయ్ మనసు బరువెక్కిపోయింది. తండ్రి చిన్నపిల్లలాగా పరిగణించిన రాజేశ్వరి అతనిక్కూడా చిన్నపిల్లలాగే కనిపించింది. ఆమెని జాగ్రత్తగా సాకాలని, మళ్లీ ఆమె ఆరోగ్యంగా తిరిగేలా చూసుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు.

మైథిలితో అతనికి చదువుకునే రోజులనుంచీ స్నేహం. స్నేహితులనేర్పరచుకునేటపుడు ఎవరైనా సాధారణంగా రూపురేఖలకన్నా మనస్తత్వానికీ, కంపాటిబిలిటీకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వేవ్‌లెంగ్త్ కలవకపోతే గాఢమైన స్నేహం కుదరదు.

అదే పెళ్లి దగ్గరకొచ్చేసరికి రూపురేఖలూ, ఆస్తీ అంతస్తులూ, కులగోత్రాలూ ముఖ్యమౌతాయి.

విజయ్‌కి మైథిలితో స్నేహం అలాగే మొదలైంది. దృఢమైన వ్యక్తిత్వం, అచంచలమైన ఆత్మవిశ్వాసం, పరవళ్లు తొక్కే ఉత్సాహం, జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోగల నేర్పు సొంతం చేసుకున్నట్టు కనిపించే ఆమె కేవలం స్నేహితురాలిగా ఉన్న రోజుల్లో రాజేశ్వరి అతని పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడల్లా తన అందమైన కొడుక్కి, కాబోయే భార్య, తన ఒక్కగానొక్క కోడలు ఎలా వుండాలో చెప్తూ ఉండేది.

అతను నవ్వుతూ వినేవాడు. అప్పుడతనిక్కూడా ఆ లక్షణాలు నచ్చేవి. మంచి ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత ఇండియా వచ్చినపుడల్లా పెళ్లిచూపులకి వెళ్లడం ఎవరూ నచ్చక వెనక్కి వెళ్లిపోవడం జరిగేది. అప్పుడే అతనికి తన జీవన సహచరి ఎలా ఉంటే బావుంటుందో అర్థమైంది. పెళ్లి టైమ్ వచ్చేసరికి అతనికి మైథిలి తప్ప ఎవరూ నచ్చలేదు.

ఆమెతో జీవితం ఎప్పటికీ విసుగనిపించదని అతనికనిపించింది. మైథిలి కూడా తన గురించి అలాగే అనుకుంటోందని తెలిసి అతని మనసు ఎగిరి గంతేసింది.

తామిద్దరి మధ్యా ఏర్పడిన అనుబంధం చాలా అరుదైనదనీ, లక్షల్లో ఒకరికి దొరికే భాగ్యమనీ తోచడంతో తల్లిదండ్రులిద్దరికీ నచ్చకపోయినా వాళ్లని అయిష్టంగానైనా ఒప్పించి మైథిలిని పెళ్లి చేసుకున్నాడు విజయ్.

తల్లిదండ్రుల మీద ఎంత ప్రేమ వున్నా వాళ్ల ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకోవలసిరావడం, తన భార్య తల్లికి దగ్గర కాలేకపోవడం విజయ్‌ని కొంత కలవరపెట్టకపోలేదు. దానికితోడు పెళ్లైన రెండేళ్లకి మైథిలికి పిల్లలు పుట్టరని తెలిసింది.

ఆ విషయాన్ని జీర్ణించుకునేందుకు ఇంకెవరైనా అయితే ఎంత స్ట్రగుల్ అయ్యేవారో! కొద్ది వారాల్లోనే తను ఆ దెబ్బ నుంచి కోలుకుంది. తర్వాత తనతో విపులంగా మాట్లాడాలని వుందనీ, ఒకరోజంతా చర్చించుకుందామనీ అడిగింది.

ఆరోజు తనకి స్పష్టంగా గుర్తుంది. ఎంత సూటిగా ఈ విషయం గురించి మాట్లాడింది! సమస్య ఇది, 'నీ రక్తం పంచుకు పుట్టిన పిల్లలే నీకు కావాలంటే నువ్వు మరో పెళ్లి చేసుకునేందుకు వీలుగా నీతో విడిపోవ డానికి సిద్ధంగా వున్నా,'నంది. నీ స్నేహాన్ని మించింది నాకేదీ లేదంటే, 'వుయ్ కెన్ రిమెయిన్ ఫ్రెండ్స్,' అంది. ఆ మాటలకి తనామెని కొట్టినంత పనిచేశాడు.

తమ దాంపత్య జీవితంలో చిన్నపాటి ఒడుదు డకులేమైనా వుంటే అవి ఆ కొద్దికాలంలో ఎదుర యినవే. అతిత్వరలోనే తామిద్దరూ కోలుకున్నారు. సుమన్‌ని దత్తత తీసుకున్నారు. ఇప్పుడు వాడు తమ బయోలాజికల్ సంతానం కాదనే ఊహే రాదు.

ఈ పెళ్లితో విజయ్ ఎప్పుడో ఒకప్పుడు చాలా అసంతృప్తికి లోనవుతాడనీ అప్పుడు చెయ్యగలిగిందేమీ ఉండదని రాజేశ్వరి భయపడింది.

తాను ఎంపిక చేసిన పిల్లయితే విజయ్ ఇంకా ఎంతో సంతోషంగా ఉండేవాడని అనుకుంటూ, భర్తతో వాదిస్తూ ఉండేది. మైథిలికి పిల్లలు పుట్టరని తెలిశాక తననుకున్నంతా అయ్యిందని బాధపడింది. మనసు సర్దుకుని, 'పోనీలే టెస్ట్‌ట్యూబ్ బేబీ కోసం ప్రయత్ని స్తారేమో,' అనుకుందిగాని ఇలా అనాథ పిల్లవాడిని దత్తత చేసుకుంటారని అనుకోలేదు.

కొడుకు విషయంలో అనుకున్నవేవీ జరక్కపోవ డంతో తననితాను మానసికంగా అతని కుటుంబం నుంచి విడదీసుకుంది రాజేశ్వరి.

పైకి అంతా సవ్యంగా కనిపించినా మైథిలిని ఆవిడ మనసుకి దగ్గరగా రానివ్వలేదు. మనవడిని హృదయానికి హత్తుకోలేదు. ప్రభాకరానికి మరింత దగ్గరగా జరిగి అతని తోడిదే లోకం అనుకుని ఆ జీవి తానికి అలవాటు పడిపోయింది. పడవ ఒడ్డుకి చేరేసరికి ఆలోచనాస్రవంతి ఆగింది. నలుగురూ కిందికి దిగి పరమార్థనికేతన్ వైపు దారితీశారు.

సుమన్ మామ్మ చెయ్యి పట్టుకున్నాడు.

రాజేశ్వరికి విజయ్ చిన్నతనం గుర్తొచ్చింది. వాడు పసివాడుగా ఉన్నపుడు తల్లి తన చెయ్యిపట్టుకోవడం వాడికి నచ్చేది కాదు. ఎక్కడైనా తప్పిపోతాడేమో అని చెయ్యి పట్టుకోబోతే విదిలించేసేవాడు, 'అయామె బిగ్ బాయ్,' అంటూ.

అపుడు తను, 'నువ్వు బిగ్‌బాయ్‌వి కదా! నేనేమో ముసలిదాన్నైపోతున్నా. సరిగ్గా నడవగలనో లేదో! నా చెయ్యిపట్టుకు నడిపిస్తావా ప్లీజ్?'' అనడిగేది.

అపుడు వాడు తన చెయ్యి గట్టిగా పట్టుకుని నడిచేవాడు. సుమన్ చెయ్యి ఇవాళ చిన్నప్పటి విజయ్ చెయ్యిలాగే అనిపిస్తోంది.

దారికటూ ఇటూ ఎన్నో షాపులు, వాటి నిండా రంగురంగుల కళాకృతులు.

పూసలతో, సెమీప్రెషస్ స్టోన్స్‌తో చేసిన గాజులూ, గొలుసులూ. ఇలా ఎక్కడికెళ్లినా ప్రభాకరం తనతో ఓపిగ్గా ఆ షాపుల్లోకి వచ్చేవారు. తనకి నచ్చినవేవో కొని వ్వడంలో ఆనందాన్ని పొందేవారు. రాజేశ్వరి కళ్లు చెమ్మగిల్లాయి.

మరికొంత దూరం నడిచి పరమార్థనికేతన్ చేరారు. భక్తులూ, ఆధ్యాత్మిక సాధనకోసం వచ్చే వారి కోసం దాదాపు వెయ్యి గదులతో, పూలమొక్కలూ, మందిరాలతో విశాలంగా ఉన్న ఆశ్రమ వాతావరణం వారిని సాదరంగా ఆహ్వానించింది.

పురాణాల్లోని రకరకాల సన్నివేశాల తాలూకు శిల్పాలు చూస్తూ సుమన్ అడిగే ప్రశ్నలకు విజయ్, మైథిలి సమాధానాలు చెబుతుంటే రాజేశ్వరి వయసు మళ్లిన స్త్రీలు, ముఖ్యంగా వితంతువులు కూర్చుని ప్రశాంతంగా భజన చేయడాన్ని గమనించి ఆగిపో యింది. ఇలాంటి చోట ఉండిపోతే?

''అమ్మా! కొంచెం ముందుగా వెళ్లి గంగ ఒడ్డున కూర్చుంటే బావుంటుంది. తర్వాత చోటు దొరకదు,'' విజయ్ మాటలకి తెప్పరిల్లి అతని వెంట అడుగులు వేసింది. అంతా ఆశ్రమద్వారం దాటి బయటికి వచ్చారు. ఎదురుగా గంగాతీరానికి ముఖ ద్వారంలాగా అందమైన కమాను.

దానిమీద కృష్ణార్జునుల రథం. ఎంత అందంగా, శోభాయమానంగా తయారు చేశాడో ఆ శిల్పి. ఈ కమానువల్ల, ఆ వెనక ప్రవహిస్తున్న గంగామాత, అంద మైన ఫ్రేములో జీవంతో పరవళ్లు తొక్కుతున్న చిత్రంలా దృష్టిపథంలో ఇమిడిపోయింది.

ఆ నీటి మధ్యగా నదీజలాల్లోంచి పైకి ఉద్భవిం చిన హిమనగంలా తెల్లని మహాశివుని ప్రతిమ.

జీవకళతో మెరిసిపోతోంది. కమాను నుండి నది వరకూ సాగిన వెడల్పాటి మెట్లు. మంత్రముగ్ధలా నిలబడిపోయింది రాజేశ్వరి. ''నాన్నా! ఇక్కడ చూడు మైటీ హనుమా! ఎంత పెద్ద స్టాట్యూనో చూశావా?'' ఆశ్చర్యంగా అరిచాడు సుమన్.

''మనూ! ఇక్కడ మాట్లాడకుండా ఉండి ఈ వాతావరణాన్ని ఫీల్ అవ్వాలి మనం! చెప్పులు స్టాండ్‌లో పెట్టి, ఇక్కడ మెట్ల మీద కూర్చుని, స్వామీజీ నిర్వహించే

హవన్ కార్యక్రమాన్ని చూడాలి. ఆ శ్లోకాలు, స్తోత్రాలు, ఆ మంత్రపఠనం వల్ల ఈ వాతావరణమంతా పాజిటివ్ వైబ్రేషన్స్ వ్యాపిస్తాయి. మౌనంగా ఆ కంపనాలని ఫీల్ అయినపుడే మన శరీరంలో జరిగే అద్భుతాన్ని మనం ఎక్స్‌పీరియన్స్ చెయ్యగలుగుతాం. సరేనా?'' అన్నాడు విజయ్ మృదువుగా.

వాడు నాదస్వరం విన్న నాగుపాములా తలూపాడు. నలుగురూ వెళ్లి ఆఖరి మెట్టుమీద నిలబడి చల్లని నీటితో కాళ్లూ, చేతులూ, కళ్లూ కడుక్కుని కొద్దిగా పైకి నడిచి మెట్టుమీద కూర్చున్నారు. అప్పటికే అక్కడ హవన్ జరుగుతోంది.

దాదాపు పాతికమంది బాలవటువులు వేద పఠనం చేస్తున్నారు. గంగమ్మ పాదాల మృదు పదధ్వని ఒకవైపు, ఏకకంఠంగా సాగుతున్న మంత్రోచ్చారణ మరోవైపూ, రాజేశ్వరి పక్కనే విజయ్, కింద మెట్టు మీద మైథిలి, సుమన్ కూర్చున్నారు.

ఆ ప్రాంతమంతా అత్యంత పరిశుభ్రంగా అలంకరించబడి ఉంది. ఎదురుగా గంగానదీ ప్రవాహం... ప్రవాహపు మధ్యలో అర్ధచంద్రాకారపు వంతెనలాంటి నిర్మాణం మీద ఎత్తుగా మహాశివుడు ధ్యానమగ్నుడై ఉన్న శిల్పం. ఆ వాతావరణం తనలోని బాధనీ, దిగులునీ, భయాలనీ చేత్తో తీసిపారేస్తున్నట్టనిపించి మెల్లగా కళ్లు మూసుకుంది రాజేశ్వరి.

శ్రుతిపక్వమైన గొంతులనేకం కలిసి చేస్తున్న శ్లోకపఠనం తాలూకు ప్రకంపనలు ఆమె శరీరంలోకి చొచ్చుకుపోయి లోపల ముడులు ముడులుగా చుట్టుకుపోయిన చికాకులనీ, గుబుల్లనీ వదులుచేసి, సాపుచేసి, కనిపించని రోగాన్ని నయం చేసినట్టనిపించింది. మెల్లగా కళ్లు తెరిచింది.

తను భూమిమీదే ఉందా? తన మనసింత హాయిగా ఆహ్లాదంగా ఎలా అయింది? దాదాపు గంటసేపు ఆ అలౌకికానుభవాన్ని అనుభూతిస్తూ, ఆ వైబ్రేషన్స్‌ని ఆస్వాదిస్తూ ఉండిపోయింది రాజేశ్వరి. అంతలో అత్యంత మార్దవమైన కంఠంతో స్వామిజీ ప్రసంగం మొదలయింది.

పర్యావరణాన్ని ముఖ్యంగా ప్రాణికోటి జీవం నిలిపే పవిత్ర గంగాజలాలని ఎలా నిర్మలంగా ఉంచుకోవాలో, మన వారసత్వ సంపదలనెలా కాపాడుకోవాలో గంభీరంగా చెప్పుకుపోతుంటే మంత్రముగ్ధులై వింటూండిపోయిన అశేష ప్రజానీకంలో తనూ ఒకతెగా నిలిచిపోయింది.

నీలతోయద మధ్యస్థా విద్యుద్వ్యుల్లేఖేవ
భాస్వరా
నీవారశూక వత్తన్వీ పీతాభాస్వత్యణూపమా
తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః

అందరిలోనూ అత్యంత సూక్ష్మరూపాన నిలిచివున్న పరమాత్మ ఆ క్షణాన తన కళ్లకు కనిపిస్తున్నట్టనిపించింది. అందరిలోనూ ఆ పరమాత్మ ఉన్నట్టయితే ఒక్క వ్యక్తి మరణం తననింత దుఃఖ సముద్రంలోకి నెట్టేయడమేమిటి?

ఆ విశాల ప్రాంగణాన్నీ, గంగానది ఉపరితలాన్నీ ఆవరిస్తున్నట్టుగా మధురమైన గానం మొదలయింది. కిందకి ఉన్న విశాలమైన చప్టా మీద కొంతమంది మైమరచి నాట్యం చేస్తున్నారు.

సంధ్యాసమయమయింది. వరసగా మెట్లమీద అమర్చిన ఇత్తడి దీపపు సెమ్మెల్లో దీపాలు వెలిగించారు. ఏకకంఠంగా గానలహరి సాగింది.

చీకట్లు ముసురుతున్నకొద్దీ ఎదురుగా ఉన్న మహాశివుని రూపం మరింత తెల్లగా ప్రకాశమానంగా అయి మనసులోని దుఃఖాన్నంతటినీ తనలో లయం చేసుకున్నట్టనిపించింది.

తీరం కనిపించినంత మేరా చూపు సారించింది. కనీసం వెయ్యిమంది జనం ఉండి ఉంటారక్కడ. అయినా ఆ శ్రావ్యమైన గానం మినహా ఎంతటి నిశ్శబ్దం... మెట్లెక్కి హారతి అందుకుంటోందా గంగమ్మ అన్నట్టు రెండు మెట్లపైదాకా వచ్చింది నీటిమట్టం.

చేతుల్లో దీపపు సెమ్మెలతో, పళ్లేలలో ప్రమిదలతో స్వామి శిష్యులంతా గంగమ్మకు హారతులిచ్చారు. ఒకరి నుంచి మరొకరికి దీపాలు చేతులు మారాయి. ఎవరో రాజేశ్వరి చేతికి అందించారు దీపమున్న పళ్లేన్ని. తిరిగి దీపాలన్నీ శిష్యుల చేతుల్లోకి చేరాయి. కార్యక్రమం ముగిసింది.

అంతా హోమభస్మాన్ని బొట్టుగా ధరించి నిశ్శబ్దంగా వెనుదిరిగారు. అప్పటికి దాదాపు ఎనిమిదయింది. మెల్లిగా వచ్చిన దారినే వెనక్కి నడిచి రాంఝూలా వంతెన చేరారు. సుమన్ గంతులేస్తూ ముందుకి పరిగెత్తాడు.

''నాన్నా! ఈ వంతెన ఉయ్యాలలా ఊగుతోంది చూశారా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అందుకే మరి దీన్ని ఝూలా అన్నారు!'' నవ్వుతూ చెప్పాడు విజయ్. ఒక అలౌకిక అనుభూతి పొందినట్టు జనమంతా దాదాపు మౌనంగా ఝూలా

మీద నడిచిపోతున్నారు. ఆ ఒడ్డు నుంచి ఈ ఒడ్డు చేర డానికి పది నిముషాలు పట్టింది.

ఆ దరినీ ఈ దరినీ కలిపే అందమైన వంతెన కన్నా మనుషులనే ఏకం చేసే మమతల వారధి మిన్న! మానవతాభావం పెంచే మార్గమే మన లక్ష్యం. మనసుల్లో శాంతిని పంచే ప్రతి యత్నపు ఫలితం... హర్షం!

చల్లగాలిలో విజయ్ పాట హాయిగా చెవికి సోకింది. తనను ఉద్దేశించే పాడుతున్నాడా అనుకుంది రాజేశ్వరి. రాత్రి పడుకుంటే ఎంతోకాలం తరువాత హాయిగా నిద్రపట్టింది.

మర్నాడు అయిదు గంటలకే లేచి స్నానాదులు ముగించుకుని ఆరింటికల్లా టాక్సీ ఎక్కి నీలకంఠేశ్వ రాలయానికి ప్రయాణమయ్యారు.

ప్రభాత కిరణాలకి కొండదారి కటూ ఇటూ చెట్ల ఆకులు మెరిసిపోతున్నాయి.

కారు పైకెక్కుతున్నకొద్దీ పర్వతశ్రేణులు రకరకాల ఛాయల్లో ఆకుపచ్చగా, నీలిపచ్చగా, లేత నీలంగా కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి.

వదిలించుకుపోతున్నా వెంటపడే అల్లరిపిల్లలా గంగానది ఎంత దూరం వెళ్లినా తమ వెంటే వస్తున్నట్టని పించింది. అద్భుత సౌందర్యరాశిలా ఆకట్టుకుని కళ్లు తిప్పుకోనివ్వలేదు.

గంటన్నర ప్రయాణం తర్వాత నీలకంఠుని ఆలయం చేరి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణ మయ్యారు. సుమన్ మళ్లీ మొదలుపెట్టాడు. "మామ్మా! ప్లీజ్ మీరూ రండి మాతో రాఫ్టింగ్‌కి. చాలా బావుంటుంది. చాలా సేఫ్. మేం ఇదివరకు వెళ్లాం," అంటూ.

"నేను రాఫ్టింగూ, జంపింగూ చెయ్యలేను నాన్నా! నువ్వూ, అమ్మ, నాన్నా వెళుదురుగాని," అంది రాజేశ్వరి.

"మరి గంగాహారతికి నేను రాలా? రాఫ్టింగ్‌కి మీరూ రావాలి. మ్యూచువల్ కో-ఆపరేషన్!" అన్నాడు.

రాజేశ్వరికి నవ్వొచ్చింది. "నదిమీద బోట్‌లో వెళ్లడం, రాంఝూలా మీద నడవడం నీకిష్టం గనక వచ్చావు. నాకోసం వచ్చావా?" అంది సరదాగా.

"ఏంకాదు. అంతసేపు ఆ హారతిలో కూచోవడం ఏం బావుంది? నదులకీ, కొండలకీ హారతులిస్తారా ఎక్కడేనా? అమ్మానాన్న మీతో వచ్చారు గనక నేనూ రావాల్సొచ్చింది.

"నాన్న ఎప్పుడూ చెప్తారు. మనం ఫ్యామిలీ కనక ఒకళ్ల కోసం ఒకళ్లు కొన్ని పనులు ఇష్టంలేకపోయినా ప్రేమతో చేయాలని."

తనవైపే చూస్తున్న వాడి నల్లటి కళ్లలో తనని కూడా తీసుకెళ్లాలని ఎంత తాపత్రయం. ఆ క్షణంలో వాడెంతో ముద్దొచ్చాడు రాజేశ్వరికి. వాడికోసం వెళ్లాలని కూడా అనిపించింది.

"నాకు నీళ్లంటే భయం నాన్నా! రాఫ్టింగ్ లాంటి ఎడ్వెంచర్స్ నేను చెయ్యలేను. నా వయసు అందుకు సహకరించదు," అంది రాజేశ్వరి వాడి బుగ్గలు సాగ తీస్తూ.

"ఫిఫ్టీ ఎయిట్ ఈజ్ నాట్ ఓల్డేజ్ మామ్మా! మొన్న పేపర్లో చదవలేదా లైఫ్ స్టార్ట్స్ ఎట్ ఫిఫ్టీ అని? ఇప్పుడే మీరు ఇలాంటివి చెయ్యాలి," అన్నాడు వాడు.

మనసులో ఎక్కడో కలుక్కుమంది. యాభయ్యే ళ్లకి జీవితం మొదలయ్యేట్టయితే యాభయ్యేడేళ్లకి భర్తని కోల్పోయిన స్త్రీ ఏమవ్వాలి?

"మామ్మ అలా అంటుంది కాని తనకి నీళ్లంటే చాలా చాలా ఇష్టంరా మనూ. ఇలా రాపిడ్స్‌లో ప్రయాణ మంటే భయంగాని వాననీళ్లన్నా, సెలయేళ్లన్నా ఎంతి ష్టమో," అన్నాడు విజయ్ ముందు సీట్లోంచి.

"మీరూ రండి అత్తయ్యా. చాలా సేఫ్ ఇది. చిన్న పిల్లలు కూడా చేస్తారు. ఒక్కసారి చేశారంటే ఇంక మీకు బోటు ప్రయాణం నచ్చదు.

"నదితో స్నేహం చేస్తూ, నదితోపాటుగా సహజ మైన ప్రయాణం చేస్తున్నట్టుండే ఈ అనుభవం వేరే ఎక్కడా దొరకదు. నిన్నటి గంగాహారతిలాగే ఇదీ ఒక అపూర్వమైన అనుభవం," అంది మైథిలి.

తనని ఎంత దూరంలో నిలిపితే అంత దూరం లోనే ఆగిపోయే మనస్తత్వం మైథిలిది.

సాధారణంగా ఏ విషయంలోనూ నొక్కిచెప్పడం ఆమెకు అలవాటు లేదు. కానీ ఈసారి అలా చెప్పాలని మైథిలికనిపించినట్టే ఆమె చెప్పిన మాటలు వినాలని రాజేశ్వరికి అనిపించింది.

"లైఫ్ జాకెట్ వుంటుంది మామ్మా... నీళ్లల్లో పడినా బలే బావుంటుంది," ఉత్సాహంగా అన్నాడు.

"నీ మొహం. నీళ్లలో పడనే పడం అత్తయ్యా. కావాలని కొంతమంది ఎక్కువ రాపిడ్స్ లేనిచోట నది లోకి దూకి ఎంజాయ్ చేస్తారు," అంది మైథిలి.

విజయ్ వైపు చూసింది రాజేశ్వరి.

"రా అమ్మా! నీకు అలవాటులేదు గనక అలా భయపడుతున్నావుగాని నీకన్నా పెద్దవాళ్లూ, చిన్నచిన్న పిల్లలు కూడా వస్తారు," అన్నాడు విజయ్.

సరే ఏమవుతుంది మహా అయితే... నీళ్లలో పడి పోతే, మునిగిపోతే మాత్రం నష్టం ఏముందీ అనిపిం

చింది. "సరే భయమే అయినా వీడికోసం వస్తాను," అంది రాజేశ్వరి.

అంతా ఉత్సాహంగా గెస్ట్‌హౌస్ దారిపట్టారు. రాజేశ్వరి తప్పక ఒప్పుకుందిగాని ఆమె మనసులో దడ గానే ఉంది. మధ్యాహ్న భోజనం అయ్యాక కొంతసేపు విశ్రాంతి తీసుకుని రాఫ్టింగ్ కోసం బయల్దేరారు. రైలు ప్రయాణం కోసం పెట్టుకున్న కుర్తా పైజామా వేసు కుంది రాజేశ్వరి.

ముందుగా బుక్‌చేసిన మూడు టికెట్లతో పాటు మరో టికెట్ కావాలని అడిగాడు విజయ్.

"ఎందుకురా విజయ్ ఆరొందలు దండగ. నాకు ఎంతమాత్రం రావాలని లేదు," అని మళ్లీ మొదలు పెట్టింది రాజేశ్వరి.

చిన్నపిల్లని చూసినట్టు ఆమెని చూస్తూ భుజాల చుట్టూ చెయ్యి వేసి, "ఇంకేం మాట్లాడకు. నువ్వే అంటావ్ ఎంత బావుందో అని," అన్నాడు ఇంకేం వినను అన్నట్టు. రాఫ్టింగ్ సరంజామాతో పాటు దాదాపు పదిమందితో జీప్ బయల్దేరింది.

మళ్లీ ఘాట్ సెక్షన్లో గంటసేపు ప్రయాణం తర్వాత కొంత ఎగువనున్న నదీ తీరం చేరారు. మిగిలిన వాళ్లంతా లైఫ్‌జాకెట్లూ, తలకి హెల్మెట్లూ చకచకా ధరించారు.

రాజేశ్వరికి మైథిలి సాయం చేసింది. గైడ్ వచ్చి అందరినీ చెక్ చేశాడు. ఈ ఎడ్వెంచర్‌లో తమకి గాయా లయినా ప్రాణాలు పోయినా అందుకు తమదే బాధ్యత అని రాసి ఉన్న ఫారమ్స్ మీద అంతా సంతకాలు పెడుతుంటే వణికే చేతులతో తానూ సంతకం పెట్టింది రాజేశ్వరి.

జీపు పైన వేసి కట్టిన తెల్లని రాజహంసలాంటి పాలిథీన్ రాఫ్ట్‌ని మోసుకుంటూ తెచ్చి నదినీళ్లలో వేశారు. నదికి దూరంగా ఉన్నప్పుడు వేడిగా అనిపించినా నీటికి దగ్గరగా వచ్చేసరికి చల్లని పిల్ల తెమ్మెరలు చుట్టి హాయిగా అనిపించింది. గైడ్ ముందు కొచ్చి ఏవో కొన్ని సూచనలిచ్చాడు.

"ఆంటీజీ! మీరు తెడ్డు వేస్తారా? ఊరికే కూర్చుం టారా?" అనడిగాడు. జారుతున్నట్టున్న తెప్ప అంచుని చూస్తూ, "నేనా ఉహు," అంది.

మైథిలి నవ్వుతూ, "అత్తయ్యా! మీరిక్కడ ముందు కూర్చోండి. ఇది బెస్ట్ వ్యూ. యూ విల్ ఎంజాయ్," అంది. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు రాజేశ్వరి రాఫ్ట్‌లోకెక్కి చెప్పిన చోట కూర్చుంది.

అటు నలుగురూ, ఇటు నలుగురూ తెడ్లు పట్టుకుని కూర్చున్నారు రాఫ్ట్ అంచుల మీద. 'రెండు చేతులతోనూ తెడ్లు పట్టుకుంటే మరీ ఎత్తైన కెరటాలు రాపిడ్స్ వస్తే నీళ్లలోకి పడిపోరూ?" అంది రాజేశ్వరి భయంగా.

"ఏం పడిపోరమ్మా! ఒక కాలు ఇక్కడా రెండో కాలు వెనకగా లాక్ చేసి పెట్టుకుంటాం. ఇందాక గైడ్ చెప్పాడుగా వినలేదా?" అన్నాడు విజయ్.

"పసివాడు కూడా తెడ్లు వెయ్యడమేమిట్రా?" అంది బెంగపడుతూ.

"మామ్మా! నేనూ నాన్నలా వెయ్యగలను! నువ్వే చూడు," అన్నాడు వాడు.

ఇంక చేసేదేంలేక, 'గంగమ్మా! నువ్వే శరణు,' అనుకుని మౌనంగా ముందుకి కూర్చుంది. ఆవిడకి చెరో వైపూ విజయ్, మైథిలీ కూర్చున్నారు.

అవి రెండూ గైడ్ స్థానం తర్వాత అతి ముఖ్య స్థానాలని తెలిసి, "ఎందుకురా నాన్నా ఇలాంటి పనులు? కొంచెం వెనక్కి కూర్చుని ఎంజాయ్ చెయ్య కూడదూ? మీరీ పనిలో వుంటే వాడినెవరు చూస్తారు?" అంది పొంగుకొస్తున్న కోపాన్నీ, నిస్సహాయతనూ అదిమి పెడుతూ.

తిక్కవేషాలు కాకపోతే ఆడదై వుండీ అంత లెక్క లేకపోవడం ఏమిటి? అనుకుంది మైథిలి వైపు నిరసన గా చూస్తూ. అదంతా ఊహించిందే అన్నట్టు విజయ్ ఆమెని లక్ష్యపెట్టకుండా తెడ్డు వేయడానికి సిద్ధమై పోయాడు.

"ఫార్వార్డ్ పాడిల్, ఏక్ సాథ్," అరిచాడు గైడ్. అంతా ఒకేసారి తెడ్డు వేశారు సుశిక్షితులైన సైనికుల్లా. నదిలో ముందుకిసాగింది రాఫ్ట్. కొన్నిక్షణాల్లోనే రాజేశ్వరి టెన్షన్ మాయమయింది.

నది పాడే సంగీతం తప్ప అంతా నిశ్శబ్దం. ఆహ్లాద కరమైన చల్లదనం. చుట్టూ కొండలు సూర్యకిరణాలకి మెరుస్తున్నాయి.

ఎదురుగా అనంతమైన జలరాశి. అందాలరాశి. అవి సూర్యకిరణాలో, చంద్ర కిరణాలో తెలియనంత హాయైన చల్లదనం. ప్రకృతికింత దగ్గరగా అసలెపుడైనా ఉన్నానా? అనుకుంది రాజేశ్వరి.

"గంగా! తెరా పానీ అమ్రుత్," వెనక కుర్రాడొకడు పాటందుకున్నాడు. తెప్ప ముందుకి సాగింది ఐదు నిముషాల పాటు. "అబ్ ఆయేగీ పెహ్లీ రాపిడ్. ఆప్ సావధాన్ రహియే. మై జైసే బోలూ ఆప్ వైసేసీ కర్నా," అన్నాడు గైడ్.

రాజేశ్వరి గుండె గుభిల్లుమంది. ఎదురుగా

కొంత దూరంలో ఉవ్వెత్తున ఎగసి పడుతూ అల్లిబిల్లిగా సుళ్లు తిరుగుతున్న కెరటాలని చూసి. "మేడం మీరు మోకాళ్ల మీద కూర్చుని తెప్ప రింగ్స్‌ని గట్టిగా పట్టుకుని తల భాగం తెప్ప ముఖం దగ్గర పెట్టుకుని కూర్చోండి," అన్నాడు హిందీలో.

రాజేశ్వరి అంతకుముందే చూపించిన విధంగా కూర్చుంది అప్రయత్నంగా. గైడ్ సూచనల కనుగుణంగా అంతా తెడ్లు వేస్తున్నారు.

దగ్గరగా వచ్చేస్తున్న నిలువెత్తు కెరటాలు తమని మింగేయడానికొస్తున్న జల చరాల్లా అనిపించాయి రాజేశ్వరికి. ఇంక ఏమయితే అదవుతుంది అనుకుని, 'గంగమ్మా! నా కుటుంబాన్ని కాపాడు. పసివెధవ నీళ్ల లోకి జారిపోకుండా కాపాడు,' పదేపదే అదే అనుకుం టుంటే తెప్ప కెరటాల పైకెక్కి వాలులోకి జారింది.

విజయ్, "మనూ! పుల్ ద వాటర్! లాక్ యువర్ ఫీట్," అంటూ కెరటాల ఎత్తుల మీంచి నీటిని తెడ్డుతో లాగుతుంటే తనకి కుడివైపు కూర్చున్న మైథిలిని ఓర కంట చూసింది రాజేశ్వరి.

ఎంత కాన్ఫిడెన్స్. సరిగ్గా విజయ్‌లాగే తెడ్డు వేస్తూ నీటిని లాగుతోంది.

ఎత్తైన కెరటాలు ఛెళ్లు ఛెళ్లున ఎడాపెడా తెప్పని కొట్టాయి. అంతా తడిసి ముద్దయ్యారు. పెద్ద కెరటం పైకెక్కి వాలులోకి జారినపుడల్లా అంతా కేరింతలు కొట్టారు ఉత్సాహంతో.

తనకటూ ఇటూ కొడుకూ కోడలూ కనిపిస్తు న్నారుగానీ కనపడకుండా వెనక ఉన్న సుమన్ గురించి ఆమెకి బెంగగా ఉంది.

ఆనందాతిరేకంతో సుమన్ పెడుతున్న కేకలు వినిపిస్తుంటే, 'అమ్మయ్య! నా మనవడు క్షేమం,' అను కుంటూ ఉంది రాజేశ్వరి.

ఎలాగయితేనేం మొదటి రాపిడ్‌ని విజయవం తంగా దాటారు. తెప్ప మళ్లీ ప్రశాంత ప్రవాహంలోకి వచ్చింది. రాజేశ్వరి మెల్లగా లేచి తన స్థానంలో కూర్చుంది. తెప్పలో జనం అంతా ఉత్సాహంతో తుళ్లి పడుతున్నారు. రాజేశ్వరికేదో అర్థమయినట్టనిపించింది.

రాపిడ్స్ వచ్చినపుడు సాధారణంగా తెప్ప కెరటాల మీద ఉయ్యాలలూగుతూ సాగుతుంది. తెప్పలోని గైడ్లిద్దరూ అవసరమైనపుడు ఏం చెయ్యాలో చేసి తెప్పని కాపాడగల సమర్థులు.

ఒకవేళ నీళ్లలో పడినా లైఫ్ జాకెట్స్ వల్ల మునిగి పోకుండా ప్రవాహంతో పాటు ముందుకి సాగుతారు. తెప్పలోని వాళ్లు వాళ్లని పైకి లాగుతారు. ఇంక నీళ్లలో ఏ రాయో తగిలి గాయాలయ్యే అవకాశం లేకపోలేదు.

ఆ మాత్రం రిస్క్ తీసుకునే ఈ క్రీడకి వస్తారు మరి. అలా అనుకున్నాక ఆమె మనసు నెమ్మదించింది. పది నిముషాలు ప్రశాంతంగా సాగిందో లేదో రెండో రాపిడ్ గురించి ప్రకటించాడు గైడ్. సర్దుకున్న రాజేశ్వరి మనసు మళ్లీ దడదడలాడింది.

ఈసారీ దాదాపు అలాగే కెరటాల సయ్యాటకి దీటుగా తెప్ప సాగింది తెడ్ల సాయంతో.

కేరింతలు మిన్నంటాయి. చొచ్చుకొచ్చిన కొండ రాళ్లని తప్పుకుంటూ, బండరాళ్లని దాటుకుంటూ ఈ నిరంతర ప్రయాణం ఆవిడకి విసుగు రాదా అనుకుంది రాజేశ్వరి. ఎన్ని అడ్డంకులొచ్చినా వీలైతే వాటిని దాటు కుంటూ, వీలు కాకపోతే తన దారి మార్చుకుంటూ సాగిపోయే గంగామాత తనకేదో పరమార్థం బోధిస్తున్న ట్టనిపించింది.

ముంచెత్తిన కెరటాలకి వీడ్కోలిస్తూ ముందుకి సాగారు. ఆ ఉధృతం తగ్గి ప్రశాంత స్థితికి వచ్చేసరికి, "విజయ్! అత్తయ్య వణుకుతున్నారు. అయ్ థింక్ షి ఈజ్ గెట్టింగ్ కోల్డ్," అంది మైథిలి.

"లేదు లేదు. అయాం ఫైన్," అంది రాజేశ్వరి వణుకుతున్న పెదవుల్ని బిగించి పెడుతూ. వెనక్కి తిరిగి సుమన్‌ని చూసింది.

"మామ్మా! ఎలా ఉంది? సూపర్ ఉంది కదా?" అన్నాడు ఈ చెవి నుంచి ఆ చెవి దాకా సాగిన నవ్వులతో. 'ఓరి పిడుగా!' అనుకుంది రాజేశ్వరి.

మూడో రాపిడ్ దాటేసరికి ఆమెకి భయం చాలా వరకు తగ్గింది. రాపిడ్ దాటిన తర్వాత వచ్చే ప్రశాంతత ఒక అద్భుతంలా అనిపించింది. అప్పటికి దాదాపు నాలుగ్గంటలై ఉంటుంది సమయం.

"సాబ్! మీరేమైనా చూయింగంలాంటివి తిన్నా చిన్న చిన్న రాపర్స్ కూడా గంగమ్మ ఒడిలోకి విసరద్దు. వాటిని నాకివ్వండి. నేను జాగ్రత్తగా తీసుకెళ్లి చెత్తబుట్ట లో వేస్తాను," అన్నాడు గైడ్ హిందీలో.

వెనక్కి తిరిగి అతన్ని పరీక్షగా చూసింది రాజేశ్వరి. ఇరవయ్యేళ్లు వుంటాయో వుండవో. వాళ్లల్లో తెల్లనివాడి కిందే లెక్క. కొంచెం బొద్దుగా, నిర్లక్ష్యంగా, 'జీవితమే ఒక ఆట. అది వెలుగునీడల సయ్యాట,' అని పాడు కుంటున్నట్టు వున్నాడు.

భయాన్ని వదిలేస్తే జీవితం ఎంత బావుంటుందో కదా అనిపించింది ఆమెకి. దూరాన రేవు కనిపించింది. అక్కడ చాలా తెప్పలు నిలిచి వున్నాయి.

"సాబ్ మనం పది కిలోమీటర్లు ప్రయాణం చేశాం. ఇక్కడ అయిదు నిముషాలు ఆగుదాం. ఎవరి కైనా మంచినీళ్లు కావాలంటే తాగచ్చు," అన్నాడు గైడ్.

"ఇంకా ఎంత దూరం?" అడిగింది రాజేశ్వరి.

"ఏమ్మా? అలసటగా వుందా? చలి వేస్తోందా?" చెయ్యి పట్టుకుంటూ అడిగాడు విజయ్.

"అదేం లేదురా? తెలుసుకోవాలని అడిగా నంతే!" అంది. నిజంగానే ప్రకృతి ఒడిలో పవళించి నట్టున్న ఈ అనుభవం బావున్నట్టే ఉంది.

"ఇంకా పదహారు కిలోమీటర్లుందమ్మా! ఇక్కడి నుంచి ఇంకా కొన్ని రాఫ్టులు మనలాగే ప్రయాణిస్తాయి. ఇపుడింకో రకం ఎంజాయ్‌మెంట్," అన్నాడు.

అయిదు నిమిషాల్లో రాఫ్ట్ మళ్లీ కదిలింది. కొత్తగా నీళ్లలోకి దిగుతున్న రాఫ్టులలో కాలేజీ కుర్రాళ్లని చూస్తూ చేతులూపారు తెప్పలో వాళ్లంతా.

పైకి లేస్తూ, కిందికి జారుతూ, సుళ్లు తిరుగుతూ రాపిడ్స్ దాటడం, లాహిరి లాహిరి లాహిరిలో అన్నట్టు అలలతో సాగడం.

భయం తగ్గాక, రాపిడ్స్ దగ్గరై ఎత్తుగా ఎగసిపడే కెరటాలు సమీపించగానే గంగామాత కెరటాల చేతు లతో తమకి స్నానం చేయిస్తున్నట్టనిపించి ముగ్ధురా లైంది రాజేశ్వరి.

నది మధ్య ఈ స్వచ్ఛ జలాల్లో అమ్మ తనంతతానే చేయించే స్నానానికీ, తను సాయంత్రం తీరంలో చేద్దామనుకున్న స్నానానికీ ఎంత తేడా అనుకుంది.

నాలుగు గంటల నదీవిహారం తర్వాత ఇరవ య్యారు కిలోమీటర్ల ప్రయాణం చివరి దశకొచ్చింది. నది బాగా వెడల్పుగా గంభీరంగా అయింది.

గైడ్, "ఇక్కడ అంతా నీళ్లలోకి దిగచ్చు," అనగానే ఒకరి తర్వాత ఒకరు తెప్ప మీంచి నీళ్లలోకి దూకారు. మైథిలి కూడా దూకి చేపలా ఈదుతూ జలకాలాడింది. గైడ్ దగ్గరున్న డ్రై బ్యాగ్‌లో పెట్టుకున్న సెల్‌ఫోనులూ, కెమెరాలూ అడిగి తీసుకుని ఫోటోలు తీసుకున్నారు.

అక్కడికి దగ్గరలో వున్న కొండ అంచు (క్లిఫ్) ఎక్కి, ముప్ఫై అడుగుల ఎత్తు నుంచి 'క్లిఫ్ జంపింగ్' చేశారు. విజయ్, మైథిలి మాత్రమే కాకుండా సుమన్ కూడా అలా దూకుతుంటే రాజేశ్వరి ఆశ్చర్యపోయింది.

బిలబిల్లాడుతూ వచ్చిన అమ్ముకునేవాళ్లు మాగీ, చాయ్ అమ్ముతుంటే రాజేశ్వరి టీ తాగింది. సుమన్ మాగీ తిన్నాడు.

అంతా మళ్లీ తెప్ప ఎక్కారు.

"నాన్నా! రాంఝూలా దగ్గరకొచ్చేశాం!" పొలికేక పెట్టాడు సుమన్.

వంతెన కింద నించి రాఫ్టు పోతుంటే, "చూశావా మనూ! నదిని డిస్టర్బ్ చెయ్యకుండా ఎలా ఈ ఉయ్యాల వంతెన కట్టుకున్నారో వీళ్లు.

"ఈ గైడ్ కుర్రాడు కూడా చూశావా ఒక్క చిన్న ప్లాస్టిక్ రాపర్ కూడా నీళ్లలో వెయ్యకుండా జాగ్రత్త తీసుకున్నాడు. తమకి బతుకుతెరువునిచ్చే గంగమ్మని వీళ్లెంతగా పూజిస్తున్నారో గమనించావా? పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే ప్రకృతి మనకెంత ఆనందాన్నీ, ఆరోగ్యాన్నీ ఇస్తుందో చూశావా!" అన్నాడు విజయ్.

"అఫ్‌కోర్స్ నాన్నా! అయ్ లవ్ యూ బోత్ అండ్ మామ్మా ఫర్ దిస్ వండ్రఫుల్ ఎక్స్‌పీరియన్స్!" అంటూ తండ్రికి ఫ్లయింగ్ కిస్ విసిరాడు వాడు.

కొద్దిసేపట్లో లక్ష్మణఝూలా కూడా దాటి మొదట బయలుదేరిన చోటికి చేరారు. తెప్ప దిగుతున్న అందరిలోనూ ఏదో పొంగిపొర్లే ఉత్సాహం... ఉల్లాసం! రాజేశ్వరి దిగబోతుంటే మైథిలి చెయ్యి అందించింది. ఆ చేతిని ఆప్యాయంగా పట్టుకుని కిందికి దిగింది రాజేశ్వరి.

ఆవలి ఒడ్డున నిన్న గంగాహారతి జరిపిన పర మార్థనికేతన్ కనిపించింది.

డ్రై బ్యాగ్‌లోంచి తమ వస్తువులు తీసుకుని నలు గురితోపాటూ రోడ్డువైపుగా నడుస్తూ తన కుటుంబాన్ని క్షేమంగా ఒడ్డుకి చేర్చిన గంగమ్మకి మనసులో నమస్క రించుకుంది రాజేశ్వరి.

"నాన్నా మళ్లీ ఎప్పుడొద్దాం?" అన్నాడు సుమన్ గునుస్తూ.

"ఇప్పటికిది పూర్తై ఇల్లు చేరలేదు. అప్పుడే మళ్లీ ఎప్పుడని అడుగుతున్నావా బుజ్జిగాడాని. వచ్చే ఏడాది వద్దాంలే," అంది రాజేశ్వరి.

*స్వాతి మాసపత్రిక, డిసెంబర్ 2012*

